క్లుప్తంగా

ఉన్నత భవితకు విద్యే మూలం



కేజీబీవీ విద్యార్థినులకు కిట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, నాయకులు

తుని రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని నాయకులు పేర్కొన్నారు. శనివారం వి.కొత్తూరు కేజీబీవీ, డాక్టర్ అంబేడ్కర్ విద్యాలయాలు, లోవకొత్తూరు పాఠశాలలో విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. వి.కొత్తూరులో జరిగిన కార్యక్రమాల్లో తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు అన్నారు. వి.కొత్తూరు కేజీబీవీలో జరిగిన కార్యక్రమాల్లో నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతనీడి అబ్బాయి, రొంగల సత్యనారాయణ (అబ్బు) విద్యార్థినులకు కిట్లను అందజేశారు. లోవ కొత్తూరు ఎంపీయూపీ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ లంక వెంకటలక్ష్మి విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో లోవ దేవస్థానం మాజీ చైర్మన్ దూలం మాణిక్యం, లంక కృపానందం, జి.అప్పారావు, ప్రిన్సిపాల్‌లు నిర్మలకుమారి, అమృతవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కిర్లంపూడి: సోమవరంలోని జిల్లా ప్రజాపరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మదీన శివదుర్గ పెద్దాపురం నవోదయ తొమ్మిదో తరగతి ప్రవేశానికి అర్హత సాధించాడు. దీంతో శివదుర్గను, శిక్షణ ఇచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.కన్నబాబును శనివారం పాఠశాల హెచ్ఎం కాంతారావు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

23, 24 తేదీల్లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదిత్య యూనివర్సిటీ అధ్యాపకులు

గండేపల్లి: ఆదిత్య యూనివర్సిటీలోని గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ఈ నెల 23, 24వ తేదీల్లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్టు ఆ స్కూల్ డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి తెలిపారు. గ్లోబల్ బిజినెస్ స్కూల్, హైదరాబాద్ ఎయిమ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో సమకాలీన విద్య విధానాలు, పరిశోధన విధానాలపై అధ్యాపకులకు, పరిశోధన చేసే స్కాలర్స్, పారిశ్రామిక అభ్యాసకులకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఆమె తెలిపారు. ఈ నెల 20 లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం దీనికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

గండేపల్లి,జగ్గంపేట: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతాంగానికి అవసరమైన విద్యుత్ సరఫరాను తొమ్మిది గంటల సమయం పగటి పూటే ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, బస్వా చినబాబు, బీపీ, మురళీరాజు, తదితరులు ఉన్నారు

గోకవరంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



గోకవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

గోకవరం: స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ విజృంభణ ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన నిర్వహించారు. పీడీఎస్‌యూ విజృంభణ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారిపై ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ గోకవరంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తే ఈ పరిసర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గ్రామంలో డిగ్రీ కళాశాల లేకపోవడం వలన సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమహేంద్రవరం, జగ్గంపేట, రంపచోడవరం వెళ్లి విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి గోకవరంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

జల తాండవం

- వర్షపు నీటితో కళకళలాడుతున్న జలాశయం
- ప్రస్తుతం 373.6 అడుగుల నీటి నిల్వలు
- శివారు ప్రాంతాలకూ అందనున్న సాగునీరు
- అన్నదాతకు ఖరీఫ్‌పై తీరిన బెంగ



సీసీ కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు(ఫైల్)



సాగునీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

కోటనందూరు: తాండవ జలాశయం సాగునీటితో తొణికిసలాడుతోంది. గత నెలంతా వరుస తుపానులతో కురిసిన వర్షానికి జలాశయంలో నీటి మట్టం అమాంతంగా పెరిగింది. జలాశయంలో ఇప్పటికీ ఇన్‌ఫ్లో భారీగా వస్తోంది. ప్రాజెక్టులో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండడంతో అన్నదాతకు ఖరీఫ్‌పై ఆశలు పెరిగాయి. తాండవ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 373.6 అడుగుల నీటి నిల్వలతో కళకళలాడుతోంది. ఖరీఫ్ ప్రారంభంలో జలాశయంలో నీటినిల్వలు లేక, వర్షాలు పడక తెగించి విత్తనాలు చల్లి వర్షం ఎప్పుడు కురుస్తుందా? అని అన్నదాత ఆకాశం వైపు ఎదురు చూసే పరిస్థితి ఉండేది. అడుగంటిన జలాశయంతో నీటి విడుదలకు ప్రతికూల పరిస్థితులు ఉండేవి. అయితే ఇప్పుడు రెట్టింపు వర్షపాతంతో నిర్ణీత సమయం కన్నా ముందే ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే పరిస్థితి కనిపిస్తోంది.

ఇదీ పరిస్థితి

తాండవ జలాశయం మొత్తం ఆయకట్టు 51,465 ఎకరాలు. ఈ ప్రాజెక్టు నుంచి అనకాపల్లి జిల్లాలో 32,500 ఎకరాలు, కాకినాడ జిల్లాలో 18,770 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ జిల్లాలోని కోటనందూరు మండలంలో 13,205 ఎకరాలు, తుని మండలంలో 4,482 ఎకరాలు, రౌతులపూడి మండలంలో 1089 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా కనిష్ఠ స్థాయి 340 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు నిబంధనల ప్రకారం జలాశయంలో 370 అడుగులు నీటి నిల్వలు ఉంటే నీటి విడుదలకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం జలాశయంలో 373.6 అడుగుల నీటి మట్టం ఉంది. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితుల్లో టైలాండు(శివారు)ప్రాంత రైతులు కూడా ఖరీఫ్‌లో నిర్భయంగా నాట్లు వేసుకోవచ్చని తాండవ అధికారులు చెబుతున్నారు. జలాశయం నుంచి అనకాపల్లి జిల్లాలో ఉన్న ఎడమ ప్రధాన కాలువ ద్వారా 25,440 ఎకరాలు, కుడి ప్రధాన కాలువ ద్వారా 7,249 ఎకరాలకు నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల మేజర్ కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఈ జిల్లాలో కుడి ప్రధాన కాలువ ద్వారా 11,391 ఎకరాలు, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 7,385 ఎకరాలకు కోటనందూరు, ఇండుగపల్లి, భీమవరపుకోట మేజర్ కాలువలు, టైలాండ్ బ్రాంచి కెనాల్ (టీఈబీసీ)ల ద్వారా ఆయకట్టు అవసరాలకు సాగునీరు అందిస్తున్నారు.

సీసీ కాలువలతో ప్రయోజనం

గతంలో కాలువలు అభివృద్ధికి నోచుకోక తాండవ నీరు శివారు ప్రాంతాలకు చేరేది కాదు. జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన తరువాత మండలానికి రావడానికి చాలా సమయం పట్టేది. సాగునీరు భూమిలో ఇంకిపోయి ఆశించిన స్థాయిలో పొలాలకు చేరేది కాదు. దీంతో ఆయకట్టు అవసరాలకు సాగునీటి సమస్య తలెత్తేది. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తాండవ కాలువల సీసీ లైనింగ్ పనుల కోసం రూ.55 కోట్లు మంజూరు చేశారు. ఆ పనులు పూర్తయి శివారు ప్రాంతాలకు సైతం పుష్కలంగా నీరు చేరే అవకాశం ఏర్పడింది. పంట పొలాలకు కూడా ఆశించిన స్థాయిలో సాగునీరు చేరుతుంది.

మెండుగా నీటి నిల్వలు



తాండవ జలాశయంలో ప్రస్తుతం నీటినిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. భవిష్యత్ వర్షాలతో సంబంధం లేకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తాం. టైలాండ్ ప్రాంత రైతులు సైతం ధైర్యంగా నాట్లు వేసుకోవచ్చు. ఖరీఫ్‌లో వంద శాతం ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– అనురాధ, డీఈఈ, తాండవ జలాశయం

జోరుగా వరినాట్లు



బెండపూడిలో వ్యవసాయబోర్ల పరిధిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

తొండంగి: ఖరీఫ్ వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. రైతులు పనుల్లో బిజీగా ఉన్నారు. మెట్ట, పల్లపు ప్రాంతాల్లో దాదాపు 600 వ్యవసాయ బోర్లు ఉన్నాయి. సుమారు రెండు వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. బెండపూడి, ఎ.కొత్తపల్లి, కోదాడ, కొమ్మనాపల్లి, సీతారాంపురం, రావికంపాడు వ్యవసాయ బోర్ల పరిధిలో ఇప్పటికే దమ్ము చేయడంతో పాటు వరినాట్ల పనులు ప్రారంభించారు. ఇటీవల అధికంగా వర్షాలు కురవడంతో చెరువుల్లో నీరు చేరడంతో ఎక్కడికక్కడ పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా పంపా, పీబీసీ ఆయకట్టు ప్రాంతాల్లో కూడా రైతులు వరిసాగుకు రైతులు సిద్ధమయ్యారు. మరి కొద్ది రోజుల్లో సాగునీటి విడుదలను బట్టి వరినాట్లు పనులు ప్రారంభంకానున్నాయి.

విధి నిర్వహణే పరమావధి



ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న మండల పరిషత్ సిబ్బంది

కోటనందూరు: విధి నిర్వహణే పరమావధిగా ఐదేళ్లపాటు మండల ప్రజలకు ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ సేవలందించారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు కొనియాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ పదవీ విరమణ సందర్భంగా శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, వృత్తినే దైవంగా భావించే మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అరుణ్‌కుమార్ అని అన్నారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పలు శాఖల అధికారులు అరుణ్‌కుమార్ సేవలను కొనియాడారు. ఎంపీపీతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయం, రెవెన్యూ, వ్యవసాయం, విద్యుత్, ఉపాధిహామీ, వైద్య ఆరోగ్య, గ్రామ సచివాలయ సిబ్బంది అరుణ్‌కుమార్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. గత ఐదేళ్ల కాలంలో తన విధి నిర్వహణకు సహకరించిన వారందరికీ అరుణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలు శ్రేయస్కరం



కామరాజుపేటలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



వి.కొత్తూరులో సామూహిక సీమంతాలు చేస్తున్న సీడీపీఓ, నాయకులు

తుని రూరల్: తల్లిపాలు అప్పుడే పుట్టిన బిడ్డల ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. శనివారం తుని మండలం వి.కొత్తూరు కాలనీ, కొత్త సూరవరంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వి.కొత్తూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టాలన్నారు. తల్లిపాలు బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుతుందని, చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటూ పిల్లల సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులకు అన్నప్రాసనలు, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేశారు. నాయకులు రొంగల సత్యనారాయణ (అబ్బు), తమరాన సత్తిబాబు, గేదెల లోవరాజు, కిల్లి శ్రీను, సూపర్‌వైజర్లు వై.వి.రమణమ్మ, వి.విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

గోకవరం: కామరాజుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సీడీపీఓ పి.వరలక్ష్మి పాల్గొని తల్లిపాల ఆవశ్యకతలపై తల్లులకు అవగాహన కల్పించారు. ప్రతి తల్లి తమ బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలను విధిగా పట్టించాలని, తల్లిపాలే చిన్నారులకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినులకు బాల్యవివాహాలు, ప్రపంచ అవయవ దాన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.చంద్రమ్మ, డీసీపీయూ అధికారి ఎస్.పావని, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న సత్యనారాయణ

తుని: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉత్తమ భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని టీడీపీ నేత ఇనుగంటి సత్యనారాయణ సూచించారు. స్థానిక బ్యాంకు కాలనీ మున్సిపల్ హైస్కూల్లో శనివారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్కూల్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హేమలత, మళ్ల గణేష్, బోడపాటి అప్పారావు, కొల్లుబోయిన కృష్ణ, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ కేఎస్ఎన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ జాతర

ఏలేశ్వరం: గ్రామ దేవత మరిడమ్మ అమ్మవారి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. లారీ యూనియన్ ఓనర్స్ అండ్ వర్కర్స్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మెయిన్‌రోడ్ ఆనుకుని ఉన్న అమ్మవారి ఆలయం వద్ద జాతర ఘనంగా జరిగింది. జాతరలో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జాతరలో గరగనృత్యం, తీన్‌మార్, శక్తివేషం, కోయిడాన్స్‌తో పాటు విచిత్రవేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. భారీఎత్తున బాణసంచా కాల్చారు. ముందుగా అమ్మవారి ఆలయం నుంచి మెయిన్‌రోడ్, బాలాజీచౌక్, నర్సీపట్నంరోడ్, దిబ్బలపాలెం మీదుగా ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆదివారం తీర్థం రోజున భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



ఆకట్టుకున్న శక్తివేషం

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి

ప్రత్తిపాడు: ప్రకృతి వ్యవసాయం సాగుతో నాణ్యమైన దిగుబడిని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) జె.ఎలియాజర్ అన్నారు. స్థనిక వెలుగు కార్యాలయంలో శనివారం ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈశిక్షణ కార్యక్రమానికి వచ్చిన డీపీఎం ఎలియాజర్ మాట్లాడుతూ ప్రకృతి సాగులో బులి రాగి సాగు చేపట్టడం వల్ల ఎక్కువ దిగుబడి సాధించవచ్చని చెప్పారు. ఎకరం విస్తీర్ణంలో బులి రాగి పంట సాగు చేస్తే 18 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సాగులో ఎరువులు, క్రిమి సంహారిక మందులను వినియోగించాల్సిన అవసరం లేదని డీపీఎం ఎలియాజర్ వివరించారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి మాట్లాడుతూ రైతులు ప్రకృతి సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని పొందవచ్చని చెప్పారు. ఏడీఏ ఎం రత్నప్రశాంతి మాట్లాడుతూ కాననాడ జీవ నియంత్రన ప్రయోగశాలలో ఉన్న తమై ప్రమాణాలతో సూడోమోనాస్, ట్రికోడెర్మా విరిడి మందులను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో ఇవి దోహదపడతాయని అన్నారు. రైతులకు రాగి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ఎంవీ సత్యనారాయణ, పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ బీవీఎస్ హరి, మాస్టర్ ట్రైనీలు మూరా చినబాబు, కె.నిఖిల్ వర్మ, ఎం.రామరాజులతో పాటు ప్రత్తిపాడు, తుని, రౌతులపూడి, తొండంగి మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



చిరుధాన్యాల సాగు శిక్షణలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం ఎలియాజర్

ఈ-పంట నమోదు తప్పనిసరి



ఈ-పంట నమోదుపై శిక్షణ ఇస్తున్న జోకా అమృత

కిర్లంపూడి: రైతులందరూ విధిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జోకా అమృత తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం వీఆర్వోలు, వీఏఏలతో ఈ-పంట నమోదుపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తమ పొలంలో పండించే పంట వివరాలను స్థానిక రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టం, ధాన్యం అమ్ముకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. తమ వెంట పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్ తీసుకెళ్లాలన్నారు. కౌలు రైతులు త్వరితగతిన కౌలు కార్డులు చేయించుకోవాలని సూచించారు.

వరినాట్ల సమయంలో జాగ్రత్తలు పాటించాలి

శంఖవరం: వరినాట్లు వేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. శనివారం గ్రామంలో వరి నారు మడులను, దమ్ము చేస్తున్న పొలాలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు వ్యవసాయ సహాయకుడు క్రాంతి, శ్రావణి, రజాక్, తరణ్ తదితరులు ఉన్నారు.

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడి



డి.పోలవరంలో రైతులకు సుడోమోనాస్ పంపిణీ చేస్తున్న ఏఓ అశోక్ కుమార్, రైతులు



సిరిపురంలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ జ్యోతి



మానవ శరీరంపై పురుగుమందుల ప్రభావాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు వివరిస్తున్న ఏఓ చంద్రశేఖర్

తుని రూరల్: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే ఖరీఫ్ పంటలకు తెగుళ్ల బెడద తగ్గి అధిక దిగబడి సాధించవచ్చని ఏఓ బి.అశోక్‌కుమార్ అన్నారు. శనివారం డి.పోలవరంలో వ్యవసాయ అధికారులు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి, రైతులకు సుడోమోనాస్ మందును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు విత్తన శుద్ధి, నాట్లకు ముందు నారు శుద్ధి చేస్తే తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు. ఫలితంగా మందుల వ్యయం తగ్గడంతో పాటు నాణ్యత ఉన్న అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. పలకా సోమేశ్వరరావు, కాశి, గణేష్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు లోవరాజు, శ్రీను, శ్రీనివాసు పాల్గొన్నారు.

సిరిపురంలో..

ఏలేశ్వరం: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సిరిపురం గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయధికారి బి.జ్యోతి రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. బాలెట్ బాక్స్ పరీక్ష నిర్వహించి రైతులకు వ్యవసాయంపై మెలకువలు తెలుసుకున్నారు. విత్తనశుద్ధి చేయడం, బ్యాక్టీరియా నిర్మూలన తదితర అంశాలు డెమో ద్వారా రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుతెగుళ్లు, కాండం కుళ్లు, మాగుడు తెగులు, అగ్గి తెగులు నివారణకు ఒక ఎకరానికి ఒక కేజీ విత్తనాల్లో 8 నుంచి 10 గ్రాముల సుడోమోనాస్ కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాకరాపల్లిలో..

కోటనందూరు: కాకరాపల్లిలో వ్యవసాయాధికారులు శనివారం పొలంబడి నిర్వహించారు. ప్రధాన పొలంలో నాట్లు వేయడం, ఎరువుల యాజమాన్యంపై వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన పొలం, నారుమడిలో చీడపీడల నివారణకు పురుగుమందులు చల్లినప్పుడు అవి మానవ శరీరంపై ఎటువంటి దుష్ప్రభావాలు చూపుతాయో ప్రయోగాత్మకంగా వివరించారు. ఖరీఫ్‌లో ఎటువంటి అవసరం వచ్చినా వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంటుపల్లి వెంకటేశ్వరరావు, ఏఈఓ కేవీ శివకుమారి, రైతులు పాల్గొన్నారు.

సామాజిక సేవతో ఉపకరణాలు

గండేపల్లి, జగ్గంపేట: సామాజిక సేవా దృక్పథంతో ఉపకరణాలు అందజేయనున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో జగ్గంపేట మండల కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ప్రారంభించారు. దివ్యాంగులకు అవసరమైన బ్యాటరీ ట్రై సైకిల్స్, నడవడానికి ఉపయోగించే కర్రలు, ట్రై సైకిల్స్, శ్రవణ యంత్రాలు, కృత్రిమ కాళ్లు, చేతులు, తదితర ఉపకరణాలను అన్ని రకాల దివ్యాంగులకు చేయూత నివ్వాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. గండేపల్లి మండలం జెడ్ రాగంపేటకు చెందిన కొమలపల్లి నాగవల్లికి వీల్‌చైర్ అత్యవసరం కావడంతో ఆమె భర్త సాంబశివుడికి వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి, మనోవికాస కేంద్రం డైరెక్టర్ పెద్దిరెడ్డి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సహకార సంస్థ సహాయ సంచాలకులు పాటంశెట్టి నారాయణమూర్తి, ఎంపీడీఓ వసంత్ కుమార్, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



శిబిరానికి వచ్చిన దివ్యాంగురాలి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

7న దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల ఏడో తేదీన విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా అందించే ఉపకరణాల గుర్తింపు కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.డేవిడ్ రాజ్ తెలిపారు. లెక్టర్ ఆదేశాల మేరకు ఏఎల్ఐఎంసీఓ సంస్థ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో మూడు చక్రాల సైకిల్, చంక కర్రలు, కాలీపర్స్, చెవి మెషీన్లు, వీల్ చైర్స్, కృత్రిక కాళ్ళు, రోలెటర్స్, వాకింగ్ స్టిక్స్, లెప్రసీ సోకిన వారికి ఏడీఎల్ కిట్స్, మానసిక ప్రతిభావంతుల పిల్లలకు కిట్లు, ఎలక్ట్రికల్ మూడు చక్రాల సైకిల్ పంపిణీకి అర్హులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఈ శిబిరానికి సదరన్ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డుతో హాజరుకావలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగే ఈ శిబిరాన్ని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలవారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

శిబిర స్థలాన్ని పరిశీలించిన డీఎల్‌డీఓ

ప్రత్తిపాడులో నిర్వహించే దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం ప్రదేశాలను కాకినాడ డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) పాటంశెట్టి నారాయణ మూర్తి శనివారం సాయంత్రం పరిశీలించారు. శిబిరం నిర్వాహణకు అనువుగా ఉండే ఎంపీడీఓ కార్యాలయ వద్ద, లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు తదితర ప్రాంతాలను పరిశీలించారు. చివరకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద శిబిరం నిర్వాహించేందుకు నిర్ణయించారు. ఆయన వెంట ఎంపీడీఓ డేవిడ్‌రాజ్, ఎంఈఓ వి.రాజబాబు, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, బి.వీరబాబు, సురేష్ తదితరులున్నారు.



ప్రత్తిపాడులో శిబిరం నిర్వహణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాకినాడ డీఎల్‌డీఓ నారాయణ మూర్తి

వనదుర్గమ్మకు నేడు ప్రత్యంగిర హోమం

అన్నవరం: రత్నగిరి దుర్గామాతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి ఆషాఢ అమావాస్య పర్వదినం సందర్భంగా ఆదివారం ఘనంగా ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యంగిర హోమం ప్రారంభిస్తారు. అనంతరం 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి, పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఈ హోమంలో పాల్గొనే వారు రూ.750 టిక్కెట్ తీసుకోవాలని అధికారులు తెలిపారు.

వరాహలక్ష్మీ నారసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: తిరుమలాయపాలెం గ్రామంలో ప్రసిద్ధి చెందిన తిరుమలాచలం కొండపై ఉన్న అమృతవల్లీ, రాజ్యలక్ష్మీ సమేత శ్రీవరాహ నారసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి విశేష సంఖ్యలో కొండకు వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు వీరమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆదివారం ఆలయంలో దీపోత్సవం నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు